క్లుప్తంగా

పంచాయతీ కార్మికులకు సన్మానం



ధన్వాడ: గోటూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం ముగింపులో భాగంగా పంచాయతీ కార్మికులకు సన్మానించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ పత్రాల అందజేత



మాగనూర్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సిలిండర్ రూ.500లకే ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు సోమవారం అర్హులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, వాకిటి శ్రీనివాసులు, ఏపీఎం వనితకుమార్, పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, దండు ఆనంద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



మద్దూరు: మండలంలోని దంగాన్‌పూర్‌కు చెందిన మధుగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002–03 పదో తరగతి బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ. 28,101 అందజేశారు. మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులకు గోపాల్, శ్రీనివాస్, రమేష్, నర్సిములు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లింగల్‌చేడ్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



మద్దూరు: మండల కేంద్రంలోని సత్యనారాయణ థియేటర్ నుంచి లింగల్‌చేడ్‌లోని పెద్దవాగు బ్రిడ్జి వరకు రూ.36 కోట్లతో చేపడుతున్న 15.8 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను సోమవారం ఆర్‌అండ్‌బీ ఏఈ విష్ణు ప్రారంభించారు. రహదారికి సింగిల్ రోడ్డు, వర్షాలు రోడ్డు కోతకు గురికావడం, గుంతలు పడడంతో రోడ్డుపై వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరగా రోడ్డు విస్తరణతో పాటు, డబుల్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనలో ప్రతిభ కనబర్చి మొదటి బహుమతికి ఎంపిక అయినట్లు హెచ్‌ఎం అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమృత్ తిప్పణ్ణ, శ్రీనివాస్, సక్సేన, శంభులింగంలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

మదనాపురం: ప్రజా సమస్యలపై తమ పార్టీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పోరాటం కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. సోమవారం మండలంలోని దుప్పల్లిలో సీపీఎం గ్రామ కమిటీని ఎన్నుకోగా.. కార్యదర్శిగా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు, కార్పొరేటు శక్తులకు అప్పజెప్పడానికి ప్రయత్నం చేస్తున్న బీజేపీని ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిబంధనలను పాటించాల్సిందే

- వరి ధాన్యం సన్నరకానికి రూ. 500 బోనస్
- కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. వరి ధాన్యం కొనుగోలుపై సోమవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం దగ్గర స్కిల్ సెంటర్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలనే ఆలోచనతో వరి ధాన్యం (సన్న రకం) కొనుగోలుకు సంబంధించి క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. సన్నాలకు బదులు దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని వరి ధాన్యం కొనుగోళ్ల అంశాన్ని సంబంధిత శాఖల అధికారులంతా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, అందరూ సమన్వయంతో పనిచేసి జిల్లా రైతాంగానికి లబ్ధి చేకూర్చాలని కోరారు. కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో, రూల్స్, గైడ్ లైన్స్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. సన్న రకం వడ్లు, దొడ్డు రకం వడ్లు వేర్వేరు కౌంటర్లలో కొనుగోలు చేసి, వేర్వేరు రిజిస్టర్ లలో నమోదు చేయాలన్నారు. అక్టోబర్ 1 నుంచి జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ఫ్లెక్సీలు, తేమను కొలిచే యంత్రాలు, రిజిస్టర్లు, ట్యాబ్ లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు తీసుకురావడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏ గ్రేడ్‌కు రూ.2320లు

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సుదర్శన్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రెండు బ్యానర్లు ఏర్పాటు చేసి, సన్న దొడ్డు రకం ధాన్యాన్ని వేరువేరుగా కొనుగోలు చేయాలని, గ్రేడ్ ఏ రకానికి ప్రభుత్వం క్వింటాకు రూ. 2320లు, సాధారణ రకానికి క్వింటాకు రూ. 2300 చెల్లిస్తోందని తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే తేమశాతం పరిశీలించిన తర్వాత నిర్వాహకులు గన్ని బ్యాగులను ఇస్తారని, అక్కడే తూకాలు చేయిస్తారని పేర్కొన్నారు. కేంద్రాలలో 500 బస్తాలు నిల్వ కాగానే లారీలను తెప్పించుకొని ఆ బస్తాలను లోడ్ చేయించి రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. ఈ సదస్సులో డీఏఓ జాన్ సుధాకర్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ దేవదాస్, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్డీఓ మేఘా గాంధీ, డీఆర్డీఓ మొగులప్పలు తమ శాఖలకు సంబంధించిన విషయాలను వివరించారు. ఈ సదస్సులో ట్రెయినీ కలెక్టర్ గరీమా నరుల, డీసీఓ అన్ని మండలాల సింగిల్ విండో అధ్యక్షులు, మండలాల స్పెషల్ అధికారులు, ఐకెపీ అధికారులు, ఏఈఓలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

భూత్పూర్ రిజర్వాయర్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నర్వ: భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు ప్రమాదం పొంచి ఉందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం ఏర్పాటు కోసం ప్రభుత్వం జీఓ నెంబర్ 14 ద్వారా భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునేలా జీఓ తీసుకొచ్చిందన్నారు. దీని వల్ల 1.2 టీఎంసీల సామర్థ్యం కల భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందుతున్న మక్తల్, నర్వ, నారాయణపేట, అమరచింత మండలాల రైతులకు సాగునీటి కష్టాలు ఏర్పడనున్నాయన్నారు. ఈ పథకం పూర్తిగా భూత్పూరు రిజర్వాయర్ ద్వారానే తీసుకుంటే ఆయా మండలాల సాగునీటి కష్టాలు రానున్నాయన్నారు. పదేళ్లుగా ఆయా మండలాల 40 వేల ఎకరాల ఆయకట్టు రైతులకు ఆశాజ్యోతిగా మారిన ఈ పథకం కొడంగల్, నారాయణపేట పథకం వల్ల ప్రమాదంలో పడనుందన్నారు. సమావేశంలో మండల పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, నాయకులు దండు అయ్యప్ప, శ్రీకాంత్‌రెడ్డి, డా.శంకర్, రాంపూర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో కొల్లూరు అభ్యర్థికి జిల్లా మొదటి ర్యాంక్

ఊట్కూర్: మండలంలోని కొల్లూర్ గ్రామానికి చెందిన స్వప్న డీఎస్సీలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించింది. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో మేథమెటిక్స్ విభాగంలో 83.3 మార్కులు సాధించి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించింది. జిల్లాలో మొదటి ర్యాంకు సాధించడంపై మాజీ సర్పంచ్ సరోజా సంవృద్ధి, నాయకులు శంకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

మక్తల్: డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని దండు గ్రామానికి చెందిన సుధాకర్ కుమారుడు రాజశేఖర్ సెంకడరీ గ్రేడ్ టీచర్ విభాగంలో 78.07 మార్కులు సాధించి 22 ర్యాంక్ పొందాడు.

ధన్వాడ: మండలంలోని మంత్రోనిపల్లి పాఠశాలలో ఎస్‌జీటీగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న మాలపోల మహేష్ డీఎస్సీలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాడు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో ప్రతిభ కనపరిచి ఉద్యోగం సాధించాడు. అలాగే ఎస్‌ఏ సోషల్ లో 6వ ర్యాంకు సాధించాడు.

అన్నదమ్ముల ఎంపిక



కృష్ణయ్య, జిల్లా 2వ ర్యాంకు, ఎస్‌ఏ ఫిజిక్స్



రమేష్, స్టేట్ 11వ ర్యాంకు, ఎస్‌జీటీ

కోస్గి: వ్యవసాయం చేసుకుంటూ తమ పిల్లలను కష్టపడి చదివించిన ఆ తల్లిదండ్రుల కలలను నిజం చేశారు ముగ్గురు కొడుకులు. ఇప్పటికే ఓ కొడుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తుండగా సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో మరో ఇద్దరు కొడుకులు ఒకేసారి ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో తల్లిదండ్రుల సంతోషానికి అవధులు లేవు. మండలంలోని ముక్తిపాడ్ గ్రామానికి చెందిన చంద్రయ్య గౌడ్, చంద్రకళ దంపతులకు ముగ్గురు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ వారు తమ పిల్లలను చదివించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కుమారులు సైతం చదువులో కష్టపడ్డారు. వీరిలో ఓ కుమారుడు అశోక్ కుమార్ గౌడ్ 2017లోనే ఉపాధ్యాయుడిగా ఎంపికై వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం అల్లీఖాన్‌పల్లిలో విధులు నిర్వహిస్తున్నాడు. తాజాగా సోమవారం ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో మరో ఇద్దరు కొడుకులు కృష్ణయ్య గౌడ్ డీఎస్సీలో జిల్లా 2వ ర్యాంకు సాధించి ఫిజికల్ సైన్స్ ఎస్‌ఏగా ఎంపికయ్యాడు. మరో కుమారుడు రమేష్ గౌడ్ స్టేట్ 11వ ర్యాంకు సాధించి ఎస్‌జీటీగా ఎంపికయ్యాడు. ఒకే ఇంట్లో ముగ్గురు అన్నదమ్ములు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మైక్రోస్కోప్ అందజేత



మైక్రోస్కోప్ అందిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

అమరచింత: మండలంలోని మస్తీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం మైక్రోస్కోప్‌ను విద్యార్థులకు ఎంఈఓ భాస్కర్‌సింగ్ చేతుల మీదుగా అందజేశారు. గత విద్యా సంవత్సరం 2022–2023 జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముఖి పోటీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు లావణ్య, హారిక, చందు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిని సాధించారు. దీంతో పాఠశాలకు మైక్రోస్కోప్‌ను బహుమతిగా అందించామని జనవిజ్ఞాన వేదిక నాయకులు వేణాచారి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటన్న, అగ్రిప్ప, ఉపాధ్యాయులు ప్రభాకర్, పాండు, నాగరాజు, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

నారాయణపేట: తిరుమల తిరుపతి లడ్డు ప్రసాదంలో కల్తీకి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీశక్తి పీఠం సన్నిధానంలో విశ్వహిందూ పరిషత్ హిందూ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం శక్తి పీఠం నుంచి చౌక్ బజార్ మీదుగా వీర సావర్కర్ చౌరస్తాకు చేరుకుని సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్‌ను కలిసి సమస్య వివరించి వినతి పత్రాన్ని అందజేశారు.

మక్తల్‌లో నిరసన

మక్తల్: లడ్డూ కల్తీపై వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, మక్తల్ అఖండ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో వివేకానంద చౌరస్తాలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీతో వెళ్లి తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

స్మృతివనం ప్రారంభం

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్, ఎస్టేట్ అధికారి చంద్రకళ తన మాతృమూర్తి దివంగత అనంతమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన స్మృతివనం (పార్క్)ను సోమవారం మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర గీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ నాగరాజుగౌడ్ ప్రారంభించారు. ఖానాపూర్‌లో డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ గ్రామస్తుల సౌకర్యార్థం అన్నిరకాల పండ్లు, పూలమొక్కలతో పార్క్‌ను ఏర్పాటు చేశారు. డీసీసీ కార్యదర్శి అయూబ్‌ఖాన్, కౌన్సిలర్ చెన్నయ్య, మాజీసర్పంచ్ తిరుపతయ్య, నిర్వాహకులు జానకీరాంరెడ్డి, రంగారెడ్డి, జైపాల్‌రెడ్డి, మధుకర్, నాయకులు మణివర్ధన్‌రెడ్డి, నాగేష్, రఫీఖ్, సర్వారెడ్డి, రమేష్, వంశీ, భగవంతు, చంద్రన్నగౌడ్ ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు



కోస్గి: జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా వార్ల విజయ్ కుమార్‌ను నియమించిన సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో వార్ల విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, నాయకులు అన్న కిష్టప్ప, నాగులపల్లి నరేందర్, కోడిగంటి హరి, హర్షవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, భాను నాయక్, మాస్టర్ శ్రీను, బోగారం ప్రభాకర్, సలీం, ఫెరోజ్, అశోక్‌తోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నారాయణపేట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని విశ్వ మానవత సేవ సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాస్ చౌదరి అన్నారు. స్థానిక సిటిజన్ క్లబ్‌లో పతంజలి యోగా సమితి నారాయణపేట వారి సహకారంతో సోమవారం ప్రత్యేక యోగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య నమస్కారాలు, యోగా ఆసనాలు, ప్రాణాయామాలు, యోగా క్రియలు, వివిధ రకాలైన రుగ్మతలకు యోగా ద్వారా ఎలా పరిష్కారం చేసుకోవచ్చో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి శైలేంద్ర కుమార్, వైద్యులు, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు కే సురేష్ , విశ్వ మానవత సేవ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేష్,, బాలప్ప రాజేంద్ర లహోటి, బలవీర్, శ్రీనివాస్, రమేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మాగనూర్: మండలంలోని కోల్పూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్థియ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మన్న మాట్లాడుతూ వైద్య పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉన్న వారిని నీలోఫర్ లేదా జీఎస్‌ఆర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ హనుమేష్, డాక్టర్ ప్రవీణ, ఉపాధ్యాయులు హారిక, సోని, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పీఆర్‌టీయూ నాయకులు

నారాయణపేట: టీఎస్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాదగిరి, జనార్దన్‌రెడ్డిలు సోమవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో పాటు డీఈఓ అబ్దుల్ ఘనీ, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ హరినాథ్‌లను ఆయా కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయుల సమస్యలను విన్నవించారు. పల్లె వెంకటరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

పౌరహక్కులను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ దయాకర్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

కృష్ణా: మండలంలోని ముర‌హర్‌దొడ్డిలో సోమవారం పౌర హక్కుల వినియోగంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల చివరివారంలో పౌర హక్కుల వినియోగంపై సమావేశం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన తన హక్కులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సురేంద్రబాబు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు, యువకులకు, విద్యార్థులకు హక్కుల గురించి అవగాహన కల్పించారు. సమాజంలో ఎలాంటి మూఢనమ్మకాలు నమ్మొద్దన్నారు. కుల, మత, వర్గ భేదాలు వీడాలన్నారు. ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి భిన్నత్వంలో ఏకత్వంగా జీవించాలని సూచించారు. మానవ హక్కులకు భంగం కలిగిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రెవెన్యూ ఆర్‌ఐ శ్రీశైలం, హాస్టల్ వార్డెన్ అప్జల్ అహ్మద్, పోలీసు సిబ్బంది ఉమేష్‌గౌడ్, నర్సిములు తదితరుల పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరనిలోటు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి టీ.సాగర్

మక్తల్: జాతీయ సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం దేశానికి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టీ.సాగర్ అన్నారు. సోమవారం పట్టణంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి సమస్యలు పరిష్కరించారలన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు చంద్రాకాంత్‌గౌడ్, నాయకులు ఆంజనేయులు, బాల్‌రాం, గోవిందురాజు, భరత్‌కుమార్, కాశప్ప, శికుమార్, మహేష్‌కుమార్, వెంకటయ్య, బాలప్ప, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

నారాయణపేట: విద్యార్థులు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని సాయి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కాలేజీలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వాటికి దూరంగా ఉండాలని ఎవరైనా ఎలాంటి వేధింపులకు గురిచేసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. రాష్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్ మద్యానికి దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గాయత్రి, ప్రిన్సిపాల్ రామకృష్ణ, వీసీలు గోపాల్, రజిత, నరసింహ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు అందిస్తాం



మాట్లాడుతున్న అధ్యక్షుడు స్వామిగౌడ్

మాగనూర్: పంటలకు సాగునీరు అందిస్తామని ముడుమల్ ఎత్తిపోతల పథకం బీ లిఫ్ట్ ఇరిగేషన్ అధ్యక్షుడు స్వామిగౌడ్ తెలిపారు. అకాల వర్షాలతో పత్తి, కంది పంట తీవ్రంగా నష్టపోవడంతో రైతులు వేరుశనగ పంట సాగు చేసుకునేందుకు సోమవారం ఆయా గ్రామాల రైతులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ మండలంలోని కోల్పూర్, మందిపల్లి, గజ్జరందొడ్డి రైతులకు వేరుశనగ పంటకు కావాల్సిన సాగునీరు అందిస్తామన్నారు. ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకట్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, యాంకి నాగేశ్వర్, అంజనేయులు, ఖలీ పషా, ప్రశాంత్, నర్సప్ప, నర్సిములు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక



ఎంపికైన మక్తల్ గురుకుల పాఠశాల విద్యార్థులు

మక్తల్: జూనియర్ షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి క్రీడలకు సోషల్ వేల్ఫేర్ గురుకుల పాఠశాల సంగంబండ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఎంపికైనట్లు గురుకుల ప్రిన్సిపాల్ చంద్రకళ, పీఈటీ శ్రీలతలు తెలిపారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వారు మాట్లాడారు. ఈ నెల 29న మక్తల్ ప్రభుత్వ మైదానంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్రాంతి పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో షూటింగ్ బాల్‌క్రీడలను ఎంపిక చేసే ప్రక్రియ నిర్వహించగా గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు హామిక, కౌసల్య, ఐశ్వర్య, వైశాలి, మానుషలు ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు తెలిపారు. 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని అన్నారు. ఎంపికైన క్రీడాకారులకు రాష్ట్ర షూటింగ్ బాల్ క్రీడల రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం మెడల్స్ అందజేశారు.

మక్తల్: నారాయణపేట జిల్లా షూటింగ్ బాల్ క్రీడలకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న ప్రభుత్వ మైదానంలో విశ్రాంతి పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన క్రీడాకారులను ఎంపిక చేశారు. అక్టోబర్ 3 నుంచి 5 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ఖోఖో పోటీలకు..

దామరగిద్ద: మండల బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి రాఘవేంద్ర జాతీయ స్థాయి ఖోఖో అండర్ 13వ విభాగంలో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 28 నుంచి అక్టోబర్ 3వరకు జార్ఖండ్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ చక్రవర్తి తెలిపారు. అదేవిధంగా మండలంలోని మొగుల్‌మడ్క జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న రోషన్ రాష్ట్ర స్థాయి కుస్తీ(రెజ్లింగ్) పోటీలకు ఎంపిక కావడంపై జీహెచ్‌ఎం ఎంఈఓ కృష్ణారెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

హైదరాబాద్‌కు తరలిన అరుణోదయ కళాకారులు



అమరచింత: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం 50 వసంతాల వేడుకల్లో పాల్గొనేందుకు పట్టణానికి చెందిన అరుణోదయ కళాకారులు సోమవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. విద్యార్థి దశలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంలో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేశామని కళాకారులు సత్యనారాయణ, సామేలు తెలిపారు. పీడీఎస్‌యూ 50 వసంతాల వేడుకల్లో పాల్గొంటూ కళాప్రదర్శన ఇవ్వనున్నట్లు తెలిపారు.